క్లుప్తంగా

గ్రామదేవతకు పూజలు

దాచేపల్లి: విస్తారంగా వర్షాలు కురిసి, పంటలు పుష్కలంగా పండాలని స్థానిక లైబ్రరీ సెంటర్‌లోని గ్రామదేవత శ్రీ మహాలక్ష్మమ్మ దేవాలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు సమర్పించారు. గ్రామమంతా కలియతిరిగి పోలిమేరలోకి సత్తెమ్మతల్లిని గ్రామస్తులు వదిలిపెట్టారు.

వీడని ముసురు



మాచర్ల: పట్టణంలో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా ముసురుతో కూడిన వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. దీంతో రైతులు పొలం పనులు ముమ్మరం చేశారు. ఆదివారం పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేశారు. వర్షాల వల్ల వాతావరణం పూర్తిగా చల్లబడింది. అంటు వ్యాధులు కొంత ప్రబలుతున్నాయి. డయేరియా కేసులూ నమోదవుతున్నాయి. రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రైల్వే స్టేషన్ రోడ్డు, 24వ వార్డు, సాగర్ రింగు రోడ్డు, కేసీపీ నుంచి కిడ్స్‌కు వెళ్లే రహదారి, విద్యుత్ కార్యాలయం ప్రాంతాల్లో రోడ్లపై నీరు పారుతోంది. చల్లటి వాతావరణం పట్టణ వాసులకు ఆహ్లాదం కలిగించింది.

ఆర్‌సీఎం చర్చి పాస్టర్ జన్మదిన వేడుకలు



మాచర్ల: నాలుగు దశాబ్దాల పాటు నిత్య సహాయ మాత, కానుకమాత, ఏసు ప్రభువు సేవలో పునీతుడవ్వడం తన అదృష్టమని పట్టణంలోని ఆర్‌సీఎం చర్చి పాస్టర్ కొమ్మారెడ్డి రఫేల్‌రెడ్డి అన్నారు. తన 60వ జన్మదినాన్ని పురస్కరించుకొని కేసీపీకి వెళ్లే రహదారిలో ఉన్న నిత్య సహాయ మాత చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పల్నాడులో ఆర్‌సీఎం సంస్థల ఆధ్వర్యంలో విద్యాభివృద్ధి, ప్రభువు, మాతల ఆరాధన కార్యక్రమాలు నిర్వహించటం జరిగిందన్నారు. చర్చి పెద్దలు జక్కిరెడ్డి మర్రెడ్డి, కిరీటిరెడ్డి, సుందరరాజ్, ప్రకాష్, సిస్టర్‌లు తోమాస్, ఇన్నమ్మ, మాసమ్మ, ఫాదర్ సోదరుడు తుమ్మారెడ్డి, తమ్మమ్మరెడ్డి భక్తులు పాల్గొన్నారు.

శాకంబరి మాతగా చౌడేశ్వరీ



రెంటచింతల: స్థానిక బాలవికాస్ స్కూల్, తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని ఆలయాల్లో కొలువైన చౌడేశ్వరీ అమ్మవారు ఆదివారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా దేవస్థానాల ప్రధాన అర్చకులు పి.అనిల్‌కుమార్ శర్మ, ఓరుగంటి మారుతిశర్మ నేతృత్వంలో పూలు, పండ్లు, పలు రకాల కూరగాయలు, వివిధ రకాల ఆకులతో అమ్మవారిని అలంకరించి, ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని, అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. పెద్దశెట్టి పల్లా వెంకటేశ్వర్లు, శీలం నారాయణ, ఆయా కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

పెదకూరపాడు: రాష్ట్రంలో దళితులపై హత్యలు, అత్యాచారాలు ఒక పక్క జరుగుతుంటే మరో పక్క దేశానికి రాజ్యాంగం రాసిన మహానుభావుడు డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాలపై కూడా దాడులు జరగడం బాధాకరమని మాల మహానాడు పెదకూరపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాతంగి సుధాకర్ అన్నారు. ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కృష్ణా జిల్లా పెడన మండలంలో దళితులు ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని కొందరు దుండగులు ధ్వంసం చేయడం సరికాదన్నారు. శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని దళితులపై దాడులతో పాటు అంబేడ్కర్ విగ్రహాలు ధ్వంసం చేస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు. దాడులు చేసిన వారిని గుర్తించి వెంటనే కఠినంగా శిక్షించాలన్నారు.

పేదలకు బియ్యం, నూతన దుస్తులు వితరణ

వినుకొండ(నూజెండ్ల): బ్రాహ్మణ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జీవీ మాధవరావు ఆధ్వర్యంలో నిరుపేద బ్రాహ్మణ కుటుంబాలకు బియ్యం, నూతన వస్త్రాలు ఆదివారం పంపిణీ చేశారు. 5వ వార్డు కౌన్సిలర్ పోలూరి అంజలీదేవి, సుబ్బారావులను ఘనంగా సత్కరించారు. చింతలచెర్వు రాఘవేంద్రరావు, పి.నారాయణరావు, శ్రావణ్‌కుమార్, విశ్వనాథశాస్త్రి, ఎ.గోపాలకృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



ఎన్ఎస్‌పీ కాలనీలో బాబాను దర్శించుకుంటున్న భక్తులు



నడికుడి సాయిబాబా మందిరంలో భజన చేస్తున్న భక్తులు

విజయపురిసౌత్: స్థానిక శ్రీ సత్యసాయి ప్రేమ మందిరంలో గురు పూర్ణిమ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు హనుమంతాచారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగడ హారతి, మంగళ స్నానం, పల్లకీ ఊరేగింపు వైభవంగా జరిపించారు. పద్మావతి భజన మండలి, సీతారామ భజన మండలి సభ్యుల ఆధ్వర్యంలో ఏకాహం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కె.హరిప్రసాద్, విశ్రాంత డీఈ నిమ్మగడ్డ వెంకటేశ్వరావు, ఎం.జానారెడ్డి, విశ్రాంత తాహసీల్దారు నరసింహారావు, సరిత, గొంతిన సాయి, రామకృష్ణ, పవన్, రాజేష్, సుధాకర్, మల్లికార్జున రావు పాల్గొన్నారు.

బాబా భక్తుల పారవశ్యం

కారెంపూడి: స్థానిక షిరిడి సాయి, సత్యసాయి సర్వమత సేవా సదన్, చెన్నకేశవస్వామి గుడి దగ్గరున్న షిరిడి సాయి దేవాలయం, ఎస్ఎస్సీ కాలనీలోని బాల నాగసాయి బాబా దేవాలయాలకు గురు పౌర్ణమి సందర్భంగా వేలాదిగా భక్తులు ఆదివారం తరలివచ్చారు. సాయి బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయి చాలీసా పారాయణం, సామూహిక వ్రతాలను ఆచరించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. బాల నాగ సాయిబాబాకు పల్లకీ సేవ నిర్వహించారు. చిన్నారుల కోలాటాల మధ్య వేలాదిగా భక్తులు వెంట రాగా బాబా ఊరేగింపు వైభవంగా కొనసాగింది. ఆలయాల్లో భజన కార్యక్రమాలు జరిగాయి.

బారులు తీరిన భక్తులు

గురజాల: నగర పంచాయతీలోని శ్రీ షిరిడి సాయి ప్రేమ సుధా మందిరంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాబాను ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. పలు అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు వేకువజాము నుంచి భక్తులు బారులు తీరారు. వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కమిటీ సభ్యులు తగు చర్యలు తీసుకున్నారు. సాయంత్రం బాబాకు గ్రామోత్సవం నిర్వహించారు. నీటిని వారుగా పోసి మహిళలు స్వాగతం పలికారు. మహిళల కోలాటం మధ్య స్వామి వారి ఊరేగింపు వైభవంగా జరిగింది.



కారెంపూడిలో షిరిడి సాయిబాబాకు ప్రత్యేక అలంకరణ

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు

దాచేపల్లి : గురు పౌర్ణమిని పురస్కరించుకుని నడికుడిలోని సాయిబాబా దేవాలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పూజారి సత్తెనపల్లి లక్ష్మణచారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. నారాయణపురంలోని సాయిబాబా ఆలయంలో పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో...

రెంటచింతల: గురుపౌర్ణమి వేడుకలను ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పాలువాయి జంక్షన్ వద్ద షిరిడి సాయి ఆలయంలో అర్చకులు ఉదయ్ పాండే పలు రకాల అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు బాబాకు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు 3 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ చైర్మన్ పందిరి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పాలువాయి ఎంపీటీసీ గుంటా ముక్కంటేశ్వర్‌రెడ్డి దంపతులు అన్నదానానికి రూ.21వేల విరాళం అందించినట్లు చైర్మన్ తెలిపారు.



పాలువాయి జంక్షన్‌లో సాయిబాబాకు పూజలు



సాయి ప్రేమ సుధా మందిరంలో బారులు తీరిన భక్తులు

వైభవంగా కనక దుర్గమ్మ బోనాలు



బోనాలు సమర్పిస్తున్న మహిళా భక్తులు

పిడుగురాళ్ల: పట్టణంలోని భవాని నగర్‌లో కనక దుర్గమ్మ బోనాల సమర్పణ ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళా భక్తులు బోనాలను నెత్తిన పెట్టుకొని గ్రామ పురవీధుల్లో తిరిగి అమ్మవారి దేవాలయానికి చేరుకున్నారు. రావూరి పూర్ణనంద శాస్త్రి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తుల దర్శనార్థం ఉంచారు. ఆషాఢ మాసం మూడవ ఆదివారం కావడంతో మహిళా భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు చీర, జాకెట్, వడికట్టు బియ్యం, పూలు, గాజులు, పసుపు, కుంకుమతో బోనాలను సమర్పించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.



ప్రత్యేక అలంకరణలో కనక దుర్గమ్మ

ఘనంగా అమృత వర్షోత్సవాలు

మాచర్ల: బ్రహ్మశ్రీ సద్గురు ముసలయార్య దేశిక స్వామి 130వ జయంతి, గురు పౌర్ణమి పురస్కరించుకొని 75వ అమృత వర్షోత్సవ ఆరాధన మహోత్సవాలు ఐదో రోజు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వెల్దుర్తి మండలం గుండ్లపాడు గ్రామంలోని జ్ఞానాశ్రమ బ్రహ్మశ్రీ కాశీ విశ్వనాథస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. బ్రహ్మశ్రీ సద్గురు ముసలయార్య దేశిక స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, శ్రీలలిత యజ్ఞం జరిపారు. అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆరాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. అన్నదానం నిర్వహించారు.



బ్రహ్మశ్రీ సద్గురు ముసలయార్య దేశిక స్వామి

కృత్రిమ జైపూర్ కాళ్లు పంపిణీ

పిడుగురాళ్ల: రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల లైమ్ సిటీ, రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం, ఎస్ఆర్ ఐవీఏ టీమ్ సహకారంతో పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో ఆదివారం దివ్యాంగులకు కృత్రిమ జైపూర్ కాళ్లను ఉచితంగా అందించారు. కొద్ది రోజుల క్రితం కొంత మంది దివ్యాంగులను గుర్తించి, కొలతలు తీసుకొని, ప్రత్యేకంగా తయారు చేసిన జైపూర్ కాళ్లను సుమారు 100 మందికి అందించినట్లు రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల లైమ్‌సిటీ అధ్యక్షుడు గుండాల అశోక్‌బాబు తెలిపారు. కృత్రి జైపూర్ కాళ్లకు అయ్యే ఖర్చును రోటరీ క్లబ్ సభ్యులు నూతి నారాయణ అందించినట్లు తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం ప్రాజెక్టు కన్వీనర్ పసుమర్తి రంగారావు, కార్యదర్శి పి.సాంబశివరావు, బి.సుధాకర్‌రావు, దళపతి, గోపి, కె.శ్రీనివాసరావు, నీరుమళ్ల రాజేష్ పలువురు పాల్గొన్నారు.



దివ్యాంగులకు కృత్రిమ జైపూర్ కాళ్లు అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

● విద్యుత్ స్తంభాలకూ టీడీపీ రంగులు..!





గారపాడు గ్రామ రహదారికి ఇరువైపులా టీడీపీ రంగులతో ముంచెత్తిన టీడీపీ నేతలు

గత ప్రభుత్వ హయంలో ప్రభుత్వ భవనాలకు వైఎస్సార్‌సీపీ రంగులు వేశారని ఎంతో హడావుడి చేసి నానా యాగి చేసిన టీడీపీ నేతలు అధికారంలోకి వచ్చిన వెంటనే చెప్పిన నీతులను మరిచారు. ఏకంగా రహదారి వెంబడి ఉన్న విద్యుత్ స్తంభాలనూ వదలకుండా నేతల పేర్లతో పసురంగులు వేశారు. పెదకూరపాడు మండలం గారపాడు గ్రామంలోని రహదారి వెంబడి విద్యుత్ స్తంభాలకు టీడీపీ రంగులు వేశారు. ఇదే తరహాలో పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలకు పచ్చ రంగు వేయడానికి సిద్ధమయ్యారు. వీటిని చూసి స్థానికులు అవాక్కవుతున్నారు.

-పెదకూరపాడు



విద్యా మణిహారం



అత్యాధునిక హంగులతో జెడ్పీ బాలికోన్నత పాఠశాల ఆవరణ

- అత్యధిక అడ్మిషన్లతో మాచర్ల జెడ్పీ బాలికోన్నత పాఠశాల
- అత్యాధునిక సౌకర్యాలు, మెరుగైన విద్యా ప్రమాణాలు
- 'నాడు – నేడు'తో తల్లిదండ్రుల్లో పెరిగిన నమ్మకం
- పట్టణంలో అధిక విద్యార్థులు చదువుతున్న ఏకైక పాఠశాల
- ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న ఉపాధ్యాయులు

మాచర్ల: అభివృద్ధిపరంగా వెనుకబడిన మాచర్ల నియోజకవర్గంలో ఒకనాడు బాలికలు చదువుకోవాలంటే ముందుకొచ్చే పరిస్థితి లేదు. ఎప్పుడు పెళ్లి చేసి పంపిద్దామా అని.. తల్లిదండ్రులు ఆరాటపడేవారు. కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో మార్పులు వచ్చాయి. తల్లిదండ్రుల్లో పిల్లలను చదివించాలన్న ఆసక్తి పెరిగింది. ముఖ్యంగా మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి చేసిన విశేష కృషి, నాడు – నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించడంతో బాలికా విద్య మరింత పెరిగింది. పట్టణంలో పలు కార్పొరేట్ పాఠశాలలున్నా.. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల అత్యధిక హాజరు శాతం కలిగి గుర్తింపు తెచ్చుకుంది. గత ఐదేళ్లలో పాఠశాలలో సౌకర్యాలు మెరుగుపర్చడం, ఆధునీకరణ చర్యలతో తల్లిదండ్రుల నుంచి మరింత ఆదరణ దక్కింది.



పాఠశాల కళా వేదిక

ఫలితాల్లో భళా..

గత విద్యా సంవత్సరం 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో పాఠశాల విద్యార్థిని 572 మార్కులు సాధించింది. అదే విధంగా 565, 561 మార్కులతో పాటు మరో 20 మంది విద్యార్థునులు 500కు పైగా మార్కులు సాధించారు. మొత్తం 10వ తరగతిలో 80శాతం ఉతీర్ణత సాధించారు. అత్యాధునికి వసతులు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, విద్యా కానుకకు తోడు.. అమ్మ ఒడి నగదు జమ అవుతుండడంతో ప్రైవేట్ స్కూళ్లను వదిలి..ఈ పాఠశాలలో విద్యార్థునులు చేరారు.

నాణ్యమైన బోధన..

ఉపాధ్యాయులు కూడా ఎంతో కష్టపడి విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేస్తున్నారు. విద్యార్థినులను తమ సొంత పిల్లలుగా భావించి వారు చేస్తున్న కృషిని తల్లిదండ్రులు గుర్తించి... పాఠశాలకు పంపేందుకు ముందుకొస్తున్నారు. గత నాలుగేళ్లుగా ప్రైవేట్ పాఠశాలలతో పోటీ పడి మరీ.. ఫలితాలు సాధించటం మరో కారణం. పట్టణ నడి బొడ్డులో రైల్వే ట్రాక్ పక్కన ఉన్న బాలికోన్నత పాఠశాలలో సౌకర్యాలు చూస్తే ఆశ్చర్యమేస్తోంది. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఏమాత్రం తీసిపోకుండా ఉంటుంది. విద్యార్థినుల ఆహ్లాదకరమైన వాతావరణంలో పోటీ చదువుతూ మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు.

మెరుగైన వసతులతో పెరిగిన విద్యార్థుల సంఖ్య



పాఠశాల తరగతి గదిలో విద్యార్థినులు

మాచర్ల జెడ్పీ బాలకల ఉన్నత పాఠశాలలో 563 మంది విదార్థినులు చదువుకుంటున్నారు. కార్పొరేట్ పాఠశాలల్లో కూడా ఇంత మంది విద్యార్థినులు లేరు. గత ప్రభుత్వం ఈ పాఠశాలలో రూ.కోటిపైగా నిధులతో నాడు నేడు కింద ల్యాబ్ సౌకర్యం, మరుగుదొడ్లు, ఫర్నీచర్, విద్యుత్ సౌకర్యాలు కల్పించింది. దీంతో పాఠశాలపై విద్యార్థినుల తల్లిదండ్రుల్లో నమ్మకం పెరిగింది. ఏడాదికేడాది విద్యార్థినుల అడ్మిషన్ల సంఖ్య పెరుగుతూనే ఉంది. మొత్తం 20 సెక్షన్‌లతో తరగతులను నిర్వహిస్తున్నారు. 34 మంది ఉపాధ్యాయులు ఉత్తమ బోధన అందిస్తున్నారు.



డిజిటల్ పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

ఉత్తమ బోధనే లక్ష్యం



సమష్టిగా ఉపాధ్యాయుల ఉత్తమ బోధన అందిస్తున్నారు. విద్యార్థినులను తీర్చిదిద్ది మంచి ఫలితాలు సాధిస్తున్నాం. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించారు. దీంతో పాఠశాలలో విద్యార్థినులను చేర్పించేందుకు తల్లిదండ్రులు పోటీ పడుతున్నారు.

– షేక్ సకీనా, హెచ్‌ఎం, జెడ్పీ బాలికోన్నత పాఠశాల, మాచర్ల

పాఠాలు బాగా చెప్తున్నారు



మా పాఠశాలలో బోధన ఎంతో బాగుంది. సౌకర్యాలు మెరుగుపరిచారు. ఉపాధ్యాయుల బోధన బాగుంది. భోజనం సంతృప్తికరంగా ఉంటుంది. అందుకే అందరూ మా పాఠశాలలో చదువుకోవటానికి ముందుకొస్తున్నారు.

– షణ్ముక ప్రియ, విద్యార్థిని, పదో తరగతి.

సన్మార్గంలో నడిపించే గురువులను పూజించాలి

అమరావతి: సమాజాన్ని సన్మార్గంలో నడిపించి అందరికి మార్గదర్శకంగా నిలిచే గురువులను పూజించాలని భవఘ్ని గురూజీ అన్నారు. మండల పరిధిలోని వైకుంఠపురంలో ఆదివారం గురు పౌర్ణమి సందర్భంగా వ్యాస భగవానుని పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా భవఘ్ని గురూజీ మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేనటువంటి ఆధ్యాత్మిక జ్ఞాన సంపద మన దేశానికి రుషులు, మునులు, గురువులు అందించారన్నారు. మహోన్నతమైన జ్ఞాన సంపదను సామాన్యునికి సైతం అర్థమయ్యే రీతిలో బోధించే గురువులను స్మరించుకోవటం అదృష్టంగా భావించాలన్నారు. వ్యాసభగవానుడు బోధించిన ధర్మాలను త్రికరణ శుద్ధిగా పాటిస్తే సమాజం సుఖ సంతోషాలతో విలసిల్లుతుందన్నారు. ఈ సందర్భంగా అదిగురువు వ్యాస భగవానునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భగవాన్ వేదవ్యాస సనాతన ధర్మ క్షేత్రం గురించి భవఘ్ని గురుదేవులు రచించిన మహావాక్య వివరణ పుస్తకాన్ని ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేష సాయి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ వేడుకలలో పాల్గొన్న భక్తులందరికీ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



యోగా కేంద్రాల నిర్వాహకులకు ఘన సన్మానం

నరసరావుపేట: పట్టణంలోని పాతూరులోని శ్రీ పట్టాభిరామస్వామి దేవాలయ ప్రాంగణంలోని వెంకటేశ్వర కల్యాణ మండపంలో ఆదివారం గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర యోగా సేవా కేంద్రం ఆధ్వర్యంలో 31వ గురుపూజా మహోత్సవం, 175 ఏ అండ్ బీ ఆనంద మహోత్సవాలు నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర యోగా మంగళగిరి ప్రధాన కేంద్ర వ్యవస్థాపకులు డాక్టర్ ఆతుకూరి వెంకటేశ్వర యోగి గురూజీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా హాజరైన రాష్ట్రంలోని 40 యోగా కేంద్రాల నిర్వాహకులు, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తాలను ఘనంగా సన్మానించారు. నరసరావుపేట శాఖ యోగా కేంద్ర నిర్వాహకులు కూనిశెట్టి వెంకటజనార్దన్, కన్వీనర్ కూనిశెట్టి అనూరాధ, ఆహ్వాన కమిటీ సభ్యులు పాలిమేర వెంకటరెడ్డి, నల్లపాటి చిన్నబ్బాయి, కనమర్లపూడి శారద, సురేష్, అద్దగిరి రమేష్ పాల్గొన్నారు.



మాజీ మున్సిపల్ చైర్మన్ గుప్తాను సన్మానిస్తున్న యోగా కేంద్ర నిర్వాహకులు

భక్తిశ్రద్ధలతో గరుడ వాహన సేవ

సత్తెనపల్లి: ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకొని పట్టణంలోని రైల్వేస్టేషన్‌రోడ్‌లో గల అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు, కలియుగ దైవం అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో శ్రీవారి గరుడ వాహన సేవ నిర్వహించారు. శ్రీవారికి స్నపన తిరుమంజన సేవ, గోత్రనామాలతో అభిషేకాలు ఆలయ అర్చకులు శ్రీమాన్ చిత్రకవి శ్యాము ఆచార్యులు రామానుజ స్వామి నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై గరుడ వాహన సేవలో పాల్గొని గరుడ ముద్దతో పాటు శ్రీవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

